


# నివాళి

**- వేదాల చంద్రవదన**



ఉగాది పోటీలో ఎంపికైన కథ

బయట ధారగా వర్షం పడుతోంది. వర్షంతో కలసి వచ్చే మట్టి వాసనను ఆఘ్రాణించడం చాలా ఇష్టం సెకండ్ లెఫ్టినెంట్ రవిచంద్రకు. బేస్ యూనిట్‌లోని తన గదిలో రిలాక్స్‌డ్‌గా కూర్చుని టీ తాగుతూ పేపరు తిరగేస్తున్నాడు. స్పోర్ట్స్ కాలమ్‌లో న్యూజిలాండ్‌పై ఇండియా క్రికెట్ జట్టు సాధించిన విజయాన్ని చదివి, మొదటి పేజీపై దృష్టిసారించాడు. కార్గిల్‌లో జరుగుతున్న యుద్ధం గురించి వార్తలు చాలానే వున్నాయందులో. యుద్ధభూమిలో తన సహచరులు వీరోచితంగా శత్రువులతో పోరాడుతున్న తీరును చదివి క్షణకాలంపాటు రవిచంద్ర ఒళ్లు గగుర్పొడిచింది.

తాను కదనరంగంలో లేకుండా సొంత రాష్ట్రంలోని కంటోన్మెంట్‌లో వుండడం కించిత్ విచారానికి గురిచేసింది రవిచంద్రకు. కానీ ఏ క్షణంలోనైనా తనకు పిలుపురావచ్చు.

రవిచంద్ర భార్య రెండవ డెలివరీ కోసం పుట్టింటికి వెళ్లింది. ఆమెతోబాటూ మూడేళ్ల పాప సౌమ్య కూడా. ఒక్కడే క్వార్టర్స్‌లో వుండడంతో రవిచంద్రకు బొత్తిగా కాలక్షేపం కాకుండా వుంది. కల్నల్ గదిలో ఫోన్ మోగింది. కాసేపు ఎవరితోనో ఆదుర్దాగా సంభాషించాడాయన. ఐదు నిమిషాల తరువాత కల్నల్ మల్హోత్రా నుండి రవిచంద్రకు పిలుపు అందింది.

ఒకసారి గట్టిగా ఊపిరి పీల్చుకొని కల్నల్ గదిలోకి ప్రవేశించాడు రవిచంద్ర. యూనిఫామ్‌లోని కల్నల్ మొఖం ఆందోళనతో నిండి వుంది. రవిచంద్రను కుర్చీలో కూర్చోమని సైగ చేశాడు.

క్షణకాలంపాటు మౌనంగా వుండి, చిన్నగా ముందుకు వంగి చెప్పాడు మల్హోత్రా, "బేడ్ న్యూస్ రవీ, యుద్ధంలో మన 18 గ్రెనేడియర్స్ యూనిట్ తరపున పోరాడుతున్న అజయ్‌కుమార్ నిన్నంతా శత్రువును నిలవరించి, ఈరోజు ఉదయం తొమ్మిదిన్నరకు టోలోలింగ్ శిఖరాగ్రంపై తూటా దెబ్బలకు బలయ్యాడు. ఇప్పుడే మన యూనిట్ కమాండర్ నుంచి మెసేజ్ వచ్చింది."

రవిచంద్ర నిశ్చేష్టుడయ్యాడు, క్షణకాలంపాటు అతని కాళ్ల కింద భూమి కంపించినట్లైంది.

ట్రైనింగ్‌లో తన క్లాస్‌మేట్ లెఫ్టినెంట్ అజయ్ చురుగ్గా, ఉత్సాహంగా అన్ని పోటీల్లో ముందుండేవాడు. తెలుగువాడు, తమ ప్రాంతం వాడైన అజయ్, తాను హాస్టల్లో ఒకే గదిలో వుండేవారు. సాయంసంధ్య వేళల్లో లాంగ్ వాక్ చేస్తూ, శలవు దినాల్లో మౌంటెనీరింగ్ చేస్తూ తానూ, అజయ్ పంచుకొన్న మధురస్మృతులు గుర్తుకొచ్చి విచార సాగరంలో మునిగాడు రవిచంద్ర.

కల్నల్ మల్హోత్రా చిన్నగా దగ్గడంతో ఇహ లోకంలోకి వచ్చాడు రవిచంద్ర. "ఐయామ్ సారీ మై బోయ్, ఐ నో యువర్ పాల్, కానీ యుద్ధ రంగంలో చావుకు చింతించకూడదు. అంతకన్నా తక్షణ కర్తవ్యం నీముందుంది. చనిపోయిన అజయ్ స్థానాన్ని నువ్వు భర్తీచేయాలి. వెంటనే నీ లగేజ్ సర్దుకుని లఢక్‌కు బయలుదేరాలి. ఏర్‌ఫోర్స్ స్పెషల్ హెలికాప్టర్ మధ్యాహ్నం నాలుగింటికి ఖాసింపూర్ ఎయిర్‌ఫీల్డ్ నుంచి బయలుదేరుతుంది. కాబట్టి వెంటనే తయారవ్వు. ఈ లోగా నీ ఆర్డర్స్, మిగతా పేపర్లు నేను సిద్ధం చేస్తాను" అన్నాడు.

రవిచంద్ర భారంగా లేచి కల్నల్‌తో కరచాలనం చేసి గది బయటకు వచ్చాడు. 'మిత్రుడు మరణించాడన్న బాధ, యుద్ధ రంగానికి వెళ్తున్నానన్న ఎక్సైట్‌మెంట్' అతడి మనసును అతలాకుతలం చేస్తున్నాయి.

* * *

మధ్యాహ్నం ఒంటి గంటకు పేక్ చేయబడిన తన ఏర్ బేగ్, సూట్ కేసులతో కల్నల్ ముందున్నాడు రవిచంద్ర. ఆ సరికి ఏవో ఫైల్స్ చూసుకుంటూ వున్నాడు మల్హోత్రా. కూర్చోమని సైగ చేశాడు.

అరగంట ముందే భార్యతో ఫోన్లో మాట్లాడాడు రవిచంద్ర. ఒక ముఖ్యమైన అసైన్‌మెంట్ మీద గుజరాత్ వెళ్తున్నట్లు, రెండు, మూడు వారాలు అక్కడే వుంటున్నట్లు చెప్పాడు భార్య సునీతకు. తాను వార్‌ఫ్రంట్‌కు వెళ్తున్నట్లు చెప్పి గర్భిణిగా వున్న ఆమె స్థైర్యానికి పరీక్ష పెట్టదలచుకోలేదతను. వేళకు భోంచేస్తూ, స్మోకింగ్‌కు దూరంగా వుండమని సుతిమెత్తగా ఫోన్లోనే అతనికి జాగ్రత్తలు చెప్పింది సునీత.

మల్హోత్రా తన కుషన్ ఛెయిర్ లోంచి లేచి రవిచంద్రతో కరచాలనం చేసి తెల్లటి కవర్‌లో వుంచిన ఆర్డర్స్ అందజేశాడు. 'బెస్టాఫ్ లక్ రవీ, విజయం మనదే, లివప్ టు ది స్పిరిట్' అని రవిచంద్రకు విషెస్ అందజేశాడు.

తన ముందున్న ఫైల్ లోంచి మరో పసుపురంగు కవర్‌ను బయటకు తీశాడు కల్నల్, రవిచంద్ర ప్రశ్నార్థకంగా చూశాడు.

"మరణించిన లెఫ్టినెంట్ అజయ్‌కుమార్‌కు ఆర్మీ తరపు నుండి అత్యవసరంగా ఐదు లక్షలకు చెక్ అందజేయమని హెడ్ క్వార్టర్స్ నుండి ఆర్డర్స్ వచ్చాయి. ఆమేరకు చెక్, దాని తాలూకు వివరాలు తెలుపుతూ మరో లేఖ తయారుచేశాను.

"ఖాసింపూర్ ఏర్‌వేస్‌కు వెళ్లే దారిలోనే గదా అజయ్ వాళ్ల వూరు తిమ్మసముద్రం. ఎలాగూ టైముంది కాబట్టి ఓ అర్ధగంట అజయ్ వాళ్లింట్లో గడిపి ఎలాగోలా ఈ మరణవార్త వాళ్లకు బ్రేక్ చెయ్యి. అలాగే ఈ చెక్ అజయ్ తండ్రి గారికందజేయి. అజయ్ ఫ్రెండ్‌వి, సమ వయస్కుడివి కాబట్టి ఈ బాధ్యత నీకప్పగిస్తున్నాను. ఐ హోప్ యు డోంట్ మైండిట్, పెద్ద వాళ్లకు ధైర్యం చెప్పి వారినెలాగో ఓదార్చు, నువ్వందుకు సమర్థుడవని నాకు తెలుసు."

సన్నగా వణికే చేతులతో రవిచంద్ర కల్నల్ చేతి లోంచి పసుపు రంగు కవర్ అందుకున్నాడు. అతడి

మనసులో ఎన్నో భావాల హోరు సాగర్‌కెరటాల్లా పొంగుతోంది.

ఆర్మీ జీప్‌లో కూర్చున్న రవిచంద్రకు కల్నల్ మల్హోత్రా, మిగతా సహచరులు సాదరంగా వీడ్కోలు పలికారు. జీపు వేగంగా వెళుతోంది. రవిచంద్రకు కల్నల్ తనకప్పగించిన కార్యం విషమ పరీక్షలా తోచింది.

"అజయ్ మరణించిన వార్తను ముసలితనంలో కొడుకు మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న అతని పేరెంట్స్‌కెలా చెప్పాలి?" ఆ వార్త విన్న షాక్‌లో వారికేమైనా జరగరానిది జరిగితే ఎలా? అజయ్ తండ్రి హార్ట్ పేషెంట్ అనీ, రెండేళ్ల క్రితం తన పీఎఫ్ నుండి లక్ష రూపాయలు లోన్ తీసుకొని అజయ్ ఆయనకు బైపాస్ సర్జరీ చేయించాడనీ హఠాత్తుగా గుర్తుకొచ్చింది రవిచంద్రకు.

అజయ్‌తో చాలా రోజులపాటు ట్రైనింగ్‌లో కలసి వుండడంతో అతని కుటుంబ పరిస్థితి చూచాయగా తెలుసు రవిచంద్రకు. ముప్పై ఏళ్లు సమీపిస్తున్నా అజయ్ పెళ్లి చేసుకోకపోవడానికి కారణం వుంది. ఇద్దరి చెల్లెళ్ల పెళ్లి బాధ్యత, తమ్ముడి ఇంజనీరింగ్ చదువు ఖర్చులు, అజయ్‌ని తన మేరేజ్ వాయిదా వేసుకొనేలా చేశాయి. ఏడాది క్రితమే ఒక చెల్లెలి పెళ్లి ఘనంగా జరిపించాడు అజయ్. తమ్ముణ్ణి డొనేషన్ కట్టి మరీ మంచి కాలేజీలో ఇంజనీరింగ్ చదివిస్తున్నాడు. అతని తండ్రి వైద్యానికి కూడా పెద్ద మొత్తంలో ఖర్చులయ్యాయి.

తన జీతంపైనే ఆధారపడిన కుటుంబం బాగోగుల కోసమే అజయ్ తన జీతంలో చాలా భాగం కేటాయించవలసి వచ్చేది. ఆ కారణంగానే అతను అవివాహితుడిగా మిగిలిపోయాడు.

జీపు మెయిన్ రోడ్ లోంచి మలుపు తిరిగి తిమ్మసముద్రానికి వెళ్లే మట్టి రోడ్డులోకి ప్రవేశించడంతో రవిచంద్ర గుండెలు టెన్షన్‌తో కొట్టుకోసాగాయి. దారిలో ఒకరిద్దరిని అడిగి అజయ్ ఇంటికి దారి కనుక్కొన్నాడు డ్రైవరు.

అజయ్ ఇంటి ముందు వేసివున్న షామియానాలనూ, అక్కడ గుమిగూడిన జనం సందోహాన్ని చూసి రవిచంద్రకు మతిపోయినట్లైంది. 'ఏం జరుగుతోందక్కడ?'

జీపులోంచి మిలట్రీ యూనిఫాంలో హుందాగా దిగుతున్న రవిచంద్రను ఆశ్చర్యంగా చూశారు కొందరు. డ్రైవర్‌ను దూరంగా జీప్ పార్క్‌చేసి, తన కోసం వేచి వుండమని చెప్పి ముందుకు కదిలాడు రవి.

రవి ఎవరో తెలియకపోయినా ఒకరిద్దరు యువకులు సాదరంగా ఆహ్వానించి షామియానాలోకి తీసుకెళ్లి ముందు వరుసల్లో కూర్చోబెట్టారు. ఎదురుగా కనిపిస్తున్న పెళ్లి మండపాన్ని, విద్యుద్దీపాలంకరణను ఆశ్చర్యంగా చూశాడు రవి. పందిట్లోంచి సన్నాయి మనోహరంగా వినిపిస్తోంది.

పట్టు పరికిణీలో వున్న ఒక అమ్మాయి స్టీల్ గ్లాసులో చల్లటి రస్నాను అందించింది రవికి. ఆశ్చర్యంలోంచి తేరుకోని రవి చిన్నగా ఆ పానీయాన్ని సిప్ చేయసాగాడు.

ఇంతలో జీన్స్, టీ షర్ట్‌లలో వున్న ఓ పాతికేళ్ల యువకుడు హడావిడిగా వచ్చి, "రండి సార్, మీరు మా అజయ్ అన్నయ్య ఫ్రెండనుకుంటా, పెళ్లి కింకా మా అన్నయ్య రాలేదేంటి సార్? మా పెదనాన్న చాలా కంగారు పడుతున్నారు. మీరోసారి లోపలకు వచ్చి ఆయనతో మాట్లాడండి" అన్నాడు.

రవిచంద్ర ఆ అబ్బాయిని చిన్నగా మాటల్లో పెట్టి విషయం కనుక్కొన్నాడు. హఠాత్తుగా అజయ్ చిన్న చెల్లెలికి పెళ్లి కుదిరింది. నెల రోజుల క్రితం జరిగిన ఎంగేజ్‌మెంట్‌కు అజయ్ వచ్చి వెళ్లాడు. ముందు పెళ్లికి మూడు నెలల తరువాత ముహూర్తం నిర్ణయించారు. ఇంతలో పెళ్లికొడుక్కు అతని కంపెనీ తరపున రెండేళ్లపాటు ఫారిన్ వెళ్లే అవకాశం వచ్చింది. అందుకే మేరేజ్ ప్రీపోన్ చేసి ఇంటి దగ్గరే ఏర్పాటుచేశారు. అజయ్ ట్రైనింగ్‌లో వున్నానని పెళ్లికి రెండురోజుల



మా అబ్బాయి రాబడి బాగా పెరగడంతోటే పది లక్షలూ, పన్నెండు లక్షలూ కట్నమిస్తామని కొందరు ఫోన్లు కూడా చేశారు. మీ సంబంధం కుదిరిపోయింది కాబట్టి అవన్నీ తోసి పుచ్చాం. కాబట్టే అదనంగా మాకో మూడు లక్షలైనా ఇవ్వాలి. లేకపోతే మేం వూరుకోం.

ముందే రాగలనని వారం క్రితం ఫోన్ చేశాడట. ఆ తరువాత అజయ్ నుండి కబురు లేదు.

"తాను యుద్ధరంగంలో వున్నానని తల్లిదండ్రులకు తెలియడం ఇష్టం లేకే అజయ్ ట్రైనింగ్‌లో వున్నానని" అబద్ధం చెప్పి వుంటాడని గ్రహించాడు రవిచంద్ర ఆలోచిస్తూ జీన్స్‌లోని కుర్రాడి వెనుకనే ఇంట్లోకి నడిచాడు.

"మా పెదనాన్న ఆ గదిలోనే వున్నారు. మీరు మాట్లాడండి" అని ఎవరో పిలుస్తుండడంతో హడావిడిగా వెళ్లిపోయాడా యువకుడు.

రవిచంద్ర అదురుతున్న గుండెలతో ఆ గది తలుపు తెరవబోయి లోపల నుండి ఏవో కేకలు వినిపిస్తుండడంతో ఆగారు.

"అన్నయ్యగారు, మీకారోజే చెప్పాను. ముహూర్తాలు పెట్టుకొనే నాటికి మా అబ్బాయి జీతం ముప్పై వేలే, ఇప్పుడు ప్రమోషన్ రావడంతోబాటూ అమెరికా వెళ్లే ఛాన్సు కూడా వచ్చింది. ఇక్కడ జీతం పెరగడంతో బాటు ఫారిన్‌లో ప్రాజెక్టు పూర్తయ్యేవరకూ, నెలకు నలభైవేల దాకా అలవెన్సు కూడా వస్తుంది. మీరు మొదట మాట్లాడుకున్న కట్నం డబ్బులతోనే సరిపెట్టాలని చూస్తున్నారు. ఇది చాలా అన్యాయం.

మా అబ్బాయి రాబడి బాగా పెరగడంతోటే పది లక్షలూ, పన్నెండు లక్షలూ కట్నమిస్తామని కొందరు ఫోన్లు కూడా చేశారు. మీ సంబంధం కుదిరిపోయింది కాబట్టి అవన్నీ తోసి పుచ్చాం.

కాబట్టి అదనంగా మాకో మూడు లక్షలైనా ఇవ్వాలి. లేకపోతే మేం వూరుకోం. ఆవేశంగా వినిపిస్తోందో స్త్రీ కంఠం.

"మీరలా అంటే ఎలాగమ్మా. నాకొచ్చే పెన్షన్ రాళ్లు తప్ప బడిపంతులుగా రిటైరైన నాకు ఏ ఆధారమూ లేద. మా అబ్బాయికీ బాధ్యతలు చాలావున్నాయి. వాడినడుగుదామన్నా, ఇంతవరకూ ఎందుకో డ్యూటీ నుంచి రాలేదు. నా పరిస్థితినర్థం జేసుకోండి." దీనంగా అభ్యర్థిస్తున్న గొంతు బహుశా అజయ్ తండ్రిదై వుండవచ్చుననుకున్నాడు రవి.

"అదేం కుదరదు. ఏమండీ, చూస్తారేం, ఇప్పటికైనా మించిపోయింది లేదు. మనకూ ఖర్చులు చాలానే వున్నాయి. ఈ సంబంధం కాకపోతే మరొకటి" విసురుగా అంటూ తలుపు తెరచుకొని విసవిసా వెళ్లిపోయిందో స్థూలకాయురాలు. ఆమె వెనుకే చిన్నగా నడుస్తూ వచ్చాడు పైజామా, లాల్చీలో వున్న ఓ బట్టతల శాల్తీ-

రవి ఆయనను ఆశ్చర్యంగా చూశాడు. డిగ్రీలో తనకు ఇంగ్లీష్ సబ్జెక్టు బోధించిన రామచంద్రంగారు. ఆయనా రవిచంద్రను అక్కడ చూసి కంగారు పడ్డాడు.

"ఏం రవి... ఇక్కడున్నావ్. ఏం చేస్తున్నావిప్పుడు?" రామచంద్రంగారి మాటలకు రవీ ఏదో సమాధానమిచ్చేంతలో 'గూడుకట్టుకొన్న విషాదం'నిండిన ముఖంతో బయటకొచ్చాడొక వృద్ధుడు. తెల్లటి పంచె, ఖద్దరు చొక్కాలో వీక్‌గా కనిపిస్తున్న ఆయనే అజయ్ తండ్రి వెంకటరావుగారుగా ఊహించాడు రవి.

అజయ్ తండ్రి రవిని క్షణకాలం విస్మయంగా చూవాడు. రవి యూనిఫామ్‌పై వున్న నేమ్‌ప్లేట్ చదివి, "బాబూ, నువ్వు రవిచంద్రవా, మా వాడు నీ గురించి చాలాసార్లు చెప్పాడు, హడావిడిలో నీకు శుభలేఖ పంపడం మరిచాను. ఔను,. మా అజయ్ ఇంకా రాలేదేం బాబూ, పెళ్లికి రెండు రోజుల ముందే వస్తానన్నాడు ఫోన్లో" అన్నాడు. ఆయన ముఖంలో ఇంకా ఇంతకు మునుపు జరిగిన ఘర్షణ తాలుకు ఛాయలు కనిపిస్తున్నాయి.


రవిచంద్ర గాఢంగా వూపిరి పీల్చుకున్నాడు. "ఆ విషయం చెప్పడానికే వచ్చానంకుల్, అజయ్ అత్యవసరంగా ఓ అసైన్‌మెంట్ నిమిత్తం అండమాన్స్‌కు వెళ్ళాడు. నాలుగైదు రోజుల్లో వచ్చేస్తాడు" అన్నాడు.

అసలే షాక్‌లో వున్న గుండె జబ్బు మనిషికి పిడుగుపాటు లాంటి వార్త ఎలా చెప్పాలో అర్థం కాలేదు రవిచంద్రకు. అందుకే సమయానుకూలంగా ఏదో చెప్పాడు.

"ఏం వుద్యోగమో ఏమో, చెల్లి పెళ్లి కూడా చూసే వీల్లేకపోయింది" అంటూ రామచంద్రం వంక తిరిగి "బావగారు ఇక మా వాడితో మాట్లాడాల్సిన అవసరం లేదు. మీక్కావాల్సిన డబ్బు నేను అరేంజ్ చేస్తాను. స్వార్జితమైన చిన్న ఇల్లొకటుందిగా" అన్నాడు ఆవేశంగా.

కూతురి పెళ్లికోసం వెంకట్రావుగారు ఉన్న ఇల్లు అమ్ముకుని వీధిన పడబోతున్నాడని అర్థమైంది రవికి. ఇక పెద్దగా ఆలోచించలేదు. రామచంద్రాన్ని గదిలోకి తీసుకెళ్లి తలుపులు మూశాడు.

(మిగతా 12వ పేజీలో)




## ప్రపంచంలో పెద్ద శిల్పాలు

జార్జి వాషింగ్టన్, అబ్రహాం లింకన్, థామస్ జెఫర్సన్, థియొడర్ రూజ్వెల్ట్‌లు అనే అమెరికా దేశాధ్యక్షుల ఛాతీవరకు చెక్కబడిన శిల్పాలు ప్రపంచంలోకెల్లా అత్యంత పెద్దవి. దక్షిణ డకోటాలో నల్ల కొండలలో మౌంట్ రష్‌మోర్‌కు ఒకవైపున వీరి శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. తలవద్ద నుండి గడ్డంవరకే 20 మీటర్ల పరిమాణంలో వారి ముఖాలు అమరి ఉన్నాయి. ఈ పెద్ద శిల్పాలు మౌంట్ రష్‌మోర్‌లో ఒక భాగంగా, జాతీయ స్మారక చిహ్నమయ్యాయి. ఇవి 'ప్రజాస్వామ్యాలయం'అనే పేరును పొందాయి.

- పి.ఎం.సుందరరావు

## 'ఏనుగు ఆయుష్షు'

ఏనుగు గరిష్ట ఆయుర్దాయం 70 సంవత్సరాలు. ఆడ ఏనుగు చూలు దాల్చాక 18నుండి 22 నెలల తర్వాత ఒక పిల్లను ప్రసవిస్తుంది. చూలు దాల్చే అవధి మగ పిల్ల, ఆడ పిల్లల విషయంలో మారుతుంది. అపురూపంగా కవలలు లేదా మూడు పిల్లలుగా పుట్టిన సందర్భాలు కూడా నమోదు అయ్యాయి. కాని సామాన్యంగా ఒక పిల్లే బ్రతుకుతుంది. మయన్మార్ (బర్మా)లో, థాయ్‌లాండ్ తెల్ల ఏనుగు పుట్టిన చోద్యం కూడా నమోదు అయింది. అక్కడ వారు ఇలాటి ఏనుగుల్ని పవిత్రంగా దేవుడితో సమానంగా భావించి గౌరవిస్తారు.



**(9వ పేజీ తరువాయి)**

"సార్, పెద్దవాళ్లు, అన్నీ తెలిసిన వాళ్లు. పీటల మీద పెళ్లిని డబ్బుకోసం ఆపడం న్యాయమా" అని నిలదీశాడు. రామచంద్రం తత్తరపడ్డాడు.

'చూడు రవీ, ఈ విషయంలో నేను అశక్తుడిని. మా ఆవిడ సంగతి నీకు తెలియదు. ఒట్టి మొండిపట్టుదల మనిషి, ఆవేశపరురాలు, అదీకాక మాకూ మరో ఇద్దర మ్మాయిల పెళ్లిచేయాల్సిన బాధ్యత వుంది" అన్నాడు బింకంగా.

"ఐతే మీక్కావాల్సింది మూడు లక్షలేగా, నేను ఏర్పాటుచేస్తానా డబ్బును. శుభకార్యం జరగనివ్వండి" అన్నాడు రవి.

"అదెలా కుదురుతుందోయ్! నీ దగ్గర అప్పు తీసుకున్నా, మళ్లీ ఆ బాకీని వెంకట్రావో, అతని కొడుకో తీర్చవలసిందే గదా" అన్నాడు రామచంద్రం.

రవిచంద్ర నింపాదిగా 'యుద్ధ భూమిలో అజయ్ మరణించిన విషయం' చెప్పాడాయనకు. రామచంద్రం స్థాణువయ్యాడు.

"అజయ్ తండ్రికి ఈ రోజో, రేపో చెక్ అందుతుంది. కాబట్టి డబ్బు గురించి మీరేం వర్రీ కావలసిన అవసరం లేదు" అని ఐదు లక్షల చెక్ తీసి రామచంద్రం చేతిలో పెట్టాడు రవిచంద్రం.

రామచంద్రం నిరుత్తరుడయ్యాడు. ఆయన ఒళ్లు క్షణకాలంపాటు జలదరించింది.

"కట్నం తీసుకోవడం నేరమని క్లాసు రూములో పాఠాలు చెప్పిన తాను స్వయంగా ఆ నేరానికే ఒడిగట్టడమా? అదీ చెట్టంత కొడుకును పోగొట్టుకొన్న కుటుంబాన్ని మరింత క్షోభ పెడ్తున్నాడు" అనుకున్నాడు. హఠాత్తుగా అనూహ్యమైన మార్పు వచ్చిందాయనలో.

రామచంద్రం విసవిసా కదిలాడు. తలుపు గొళ్లెం తీసుకొని ఎటో వెళ్లాడు. వెంకట్రావుగారు గాబరాగా గదిలోకి వచ్చారు. ఆయనకంతా అయోమయంగా వుంది. కంగారుగా రవినేదో అడుగుతున్నాడు.

పది నిమిషాల్లో రామచంద్రం గదిలోకి తిరిగి వచ్చి, రవిచంద్ర చెయ్యి పట్టుకొని బయటకు తీసుకువెళ్లాడు. "ఎక్కడికా అబ్బాయిని తీసుకువెళ్తున్నారు?" రవీ భోంచేసి వెళ్దువుగానీ" అని వెనక నుంచి వెంకట్రావుగారు అరవడం వినిపిస్తోంది.

రవింద్ర జీప్ పార్క్ చేసి వున్న ప్రాంతానికి ఇద్దరూ నడిచారు. రామచంద్రం జేబిలోంచి ఐదు లక్షల చెక్ తీసి రవి చేతిలో పెట్టాడు. ఆప్యాయంగా రవి చేతులు పట్టుకున్నాడు.

"జాతస్య మరణం ధృవం'. పుట్టిన వాడు గిట్టక మానడు. కానీ దేశ రక్షణకోసం వీరోచితంగా ప్రాణాలర్పించిన అజయ్ లాంటి త్యాగమూర్తులు మహోన్నతంగా మిగిలిపోతారు. అజయ్ త్యాగంతో, డబ్బు పిచ్చిలో వున్న నా కళ్లు తెరచుకున్నాయి. కావలిస్తే నా భార్య చెంపలు పగలగొట్టైనా ఈ పెళ్లి జరిగేలా చూస్తాను. ఇదే అజయ్‌కు నేనివ్వగల 'నివాళి.'

అంతేకాదు, పెళ్లయ్యాక సమయం చూసి వెంకట్రావుకి నెమ్మదిగా నేనే అజయ్ మరణవార్త చెప్తాను. వారం తరువాత ఈ చెక్ ఎవరితోనైనా పంపించమని మీ వాళ్లకు చెప్పు. క్షేమంగా వెళ్లి రా బాబు" అన్నాడు.

'ఆ సరికి అక్కడకు చేరుకున్న వెంకట్రావుగారు వారిద్దరి వంకా అనుమానంగా చూశారు. రవి ఆయన చేతులు పట్టుకొని, 'ఈ పెళ్లి గురించి మీరేం బెంగపెట్టుకోకండి. రామచంద్రంగారు మిమ్మల్ని డబ్బు విషయంలో బాధపెట్టరు" అన్నాడు. పెద్ద వాళ్లిద్దరి దగ్గరా శెలవు తీసుకొని రవిచంద్ర జీపు ముందు సీట్లో డ్రైవర్ పక్కన కూర్చున్నాడు. దుమ్ము రేపుకుంటూ జీపు ముందుకు కదిలింది.

రామచంద్రం కళ్లల్లో సన్నటి కన్నీటి పొర కదిలింది. దూరమౌతున్న జీపు, చేయి వూపుతున్న రవి అస్పష్టంగా కనిపించారందులో.

"ధాత్రి జనని గుండె మీది... యుద్ధపు కొరకంచుల ఎర్రని రవ్వలు... మీరెప్పుడైనా చూశారా... కన్నీరైనా విడిచారా... మీరిపుడైనా మేలుకొంటారా... చీకటి తెరలను చీలుస్తారా..." రామచంద్రం హృదిలో ఆర్ద్రతతో తిలక్ గేయం వినిపిస్తోంది. ★